# ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

అధ్యక్షులు : కె.జి. కన్నబిరాన్ ప్రధాన కార్యదర్శి : డా॥ కె. బాలగోపాల్

గా॥ రాష్ట్ర అసెంబ్లీ సభ్యులకు,

అయ్యా! అమ్మా!

మన రాష్ట్రంలోని వివిధ జైళ్లలో వున్న జీవితఖైదీల విషయమయి మీకు ఈ విజ్ఞప్తి చేస్తున్నాము.

కోర్టులో శిక్షపడిన ఖైదీల శిక్షను తగ్గించే అధికారం రద్దు అధికారం ప్రభుత్వానికి చట్టంలో ఉన్న సంగతి మీకు తెలిసిందే. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ల 432, 433 రాష్ట్ర ప్రభుత్వానికి ఈ అధికారం ఇచ్చాయి. రాజ్యాంగంలోని అధికరణాలు 72, 161 దేశ రాష్ట్రపతికీ, గవర్నర్‌కూ ఈ అధికారాన్ని ఇచ్చాయి.

నేరస్థులంటే సంఘ విద్రోహులని భావించనవసరం లేదనీ, మనుషులు అనేక సామాజిక, ఆర్థిక ఒత్తిడుల ఫలితంగా నేరాలకు పాల్పడడం జరుగుతుందనీ ఆధునిక నేరశాస్త్రం భావించబట్టే పై అధికారాలను చట్టంలోను, రాజ్యాంగంలోను పొందుపరచబడ్డాయి. నేరానికి ప్రతీకారం శిక్ష కాదనీ, మనిషిని మార్చుకోవడం కోసం మాత్రమే శిక్ష వేయాలనీ ఆధునిక నేరశాస్త్రం భావిస్తుంది. అందువల్ల ఒక మనిషిని ఇంక ఖైదులో ఉంచడం అనవసరం అని భావిస్తే వదిలిపెట్టే అధికారం ప్రభుత్వానికి ఉండడం సబబు. దీనిని పాలకపార్టీలు రాజకీయంగా దుర్వినియోగం చేసినంత మాత్రాన సూత్రప్రాయంగా ఇది సమంజసమైనది కాకుండాపోదు.

అయితే రాజకీయ దుర్వినియోగం తరచుగా జరిగిన కారణంగా 1978లో చట్టాన్ని సవరించి కేంద్ర పార్లమెంటు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కు సెక్షన్ 433-Aని చేర్చింది. దాని ప్రకారం హత్యవంటి తీవ్రమయిన నేరాలకు జీవితఖైదు అనుభవిస్తున్న ఖైదీలను ఎట్టి పరిస్థితులలోను 14 సంవత్సరాలలోపు విడిచి పెట్టడానికి వీలులేదు. ఒకరి పాపానికి అందరూ బలయినట్టు, రాజకీయ నాయకుల అధికార దుర్వినియోగం ఫలితంగా వచ్చిన ఈ సవరణకు ఇంతటి కాఠిన్యానికి అర్హులు కాని వారు కూడ గురి కాక తప్పలేదు. ఈ సవరణపట్ల దేశవ్యాప్తంగా ఖైదీలలో నిరసన వచ్చినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు.

అయితే 1980-83లో నివేదిక తయారుచేసిన అఖిల భారత జైళ్ల సంస్కరణ కమిటీ ఈ విషయంలో తన అభిప్రాయం చెబుతూ, 14 సంవత్సరాలు జైలులో గడిపి తీరాలన్న నియమం, వ్యక్తి సంస్కరణకు కానీ సమాజ భద్రతకు కానీ అవసరం కాదని అనింది. ఖైదీలు మానసికంగా దుర్బలులు కావడానికి మట్టుకే ఇది దోహదం చేస్తుందని ఆ కమిటీ అనింది. 14 సంవత్సరాల నియమం ఖచ్చితంగా పెట్టుకోకుండా, ఇంక నిర్బంధం అనవసరం అనుకున్నప్పుడు వదిలిపెట్టే సంప్రదాయం ఉండాలని సూచించింది.

అన్ని నివేదికలలాగే ఇది కూడా చాలాకాలం చెదలకు భోజ్యమయి వుంది. చివరకు 1988లో మన రాష్ట్ర ప్రభుత్వ అడ్వైజరీ బోర్డ్ ఫర్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ పై నివేదిక సూచనను పరిశీలించి, 14 సంవత్సరాలలోపే ఖైదీలను విడుదల చేయడం అనుచితం కాదని అభిప్రాయపడుతూ ఈ క్రింది కోవలకు చెందిన ఖైదీలను ఎప్పటికప్పుడు విడుదల చేయడం కోసం సూచనలు చేసింది.

1. వయసు 65 సంవత్సరాలు పైబడి వుండి, శిక్ష కనీసం 3 సం॥లు పూర్తి చేసిన వాళ్ళు.
2. శారీరక దార్ఢ్యాన్ని కోల్పోయిన వృద్ధులు, లేక అనారోగ్యవంతులు (మెడికల్ బోర్డు సలహా మేరకు)
3. రిమాండ్‌తో సహా 10 సం॥ల ఖైదు పూర్తి చేసినవారు.

మళ్ళీ ఒక సంవత్సరం జాప్యం తరువాత రాష్ట్ర ప్రభుత్వం 1.2.1990 నాడు ఈ సూచలనకు చట్టరూపం ఇస్తూ జి.వో.ఎం.ఎస్. 90 జారీ చేసింది. అడ్వైజరీ బోర్డ్ చేసిన పై సూచనను ఆమోదిస్తూ, దానిని అమలు చేయడం కోసం ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఈ జివో సూచించింది. అందులో రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి (కమిటీ అధ్యక్షుడు), జైళ్ల ఇన్స్‌పెక్టర్ జనరల్ (కార్యదర్శి). జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి (సభ్యుడు) ఉంటారు.

అయితే ఒక సంవత్సరం తరువాత గానీ ఈ జివోను జైళ నియమావళిలోకి చేర్చలేదు. 29.1.1991 నాడు జారీ చేసిన జివో ఎం.ఎస్. 69 ద్వారా పై జివో ఎం.ఎస్. 90 జైళ్ల నియమావళిలో చోటు చేసుకుంది. ఇందులో, పైన పేర్కొన్న త్రిసభ్య కమిటీ సంవత్సరంలో కనీస పక్షం నాలుగుసార్లు కలవాలనీ, అవసరమయితే అంతకంటే తరుచుగా కూడ కలవాలీ, కమిటీ కలిసినప్పుడల్లా రాష్ట్రంలోని జీవితఖైదీల జాబితాను పరిశీలించి పైన పేర్కొన్న నియమాల ప్రకారం ఎవరు విడుదలకు అర్హులయితే వారిని రాజ్యాంగంలోని అధికరణం 161 క్రింద విడుదల చేయించవలసిందిగా రాష్ట్ర గవర్నర్‌కు సూచించాలనీ స్పష్టంగా చెప్పడం జరిగింది.

జైళ్ల నియమావళిలో ఈ సవరణ జరిగి ఒక సంవత్సరం 7 నెలలు గడిచాయి. కాని త్రిసభ్య కమిటీ ఇప్పటిదాకా కలిసింది కేవలం రెండుసార్లు! అది కూడ కొందరు జివిత ఖైదీలు, భారత న్యాయవాదుల సంఘం (ఐఎల్ఏ) ఆంధ్రరాష్ట్ర శాఖ హైకోర్టులో రిట్ పిటిషన్లు వేసి ఒత్తిడి చేసిన తరువాతే ప్రభుత్వమే జారీ చేసిన జివోను అమలు చేయాడంలో ఇంత నిర్లక్ష్యం ఎందుకో ఏలినవారికే తెలియాలి. ఈ నిర్లక్ష్యం వల్ల, విడుదలకు అర్హులయిన ఖైదీలు ఏళ్ళ తరబడి జైలులో మగ్గడం చాలా ఘోరమయిన అన్యాయం.

ఈ నిర్లక్ష్యం ఒక అన్యాయమయితే, త్రిసభ్య కమిటీ సమావేశం అంటూ అయినప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలు మరీ అన్యాయంగా ఉన్నాయి. జివో ఎం.ఎస్. 90 ఉద్దేశ్యాన్ని సరిగ్గా అర్థం చేసుకొనేటట్టయితే, ఒక్కొక్క జీవిత ఖైదీ రికార్డును పరిశీలించి ఆ వ్యక్తి వయసు 65 సంవత్సరాలు దాటాయా లేదా, ఆరోగ్యం దిగజారిందా లేదా, 10 సం॥ల శిక్షకాలం పూర్తయిందా లేదా అనేది విచారించడం మాత్రమే త్రిసభ్య కమిటీ బాధ్యత. వీటిలో ఏ ఒక్క విషయం అనుకూలంగా ఉన్నా ఆ ఖైదీని విడుదల చేయమని గవర్నర్‌కు కమిటీ రాయవలసిందే. అయితే దురదృష్టవశాత్తు, త్రిసభ్య కమిటీ ఆ బాధ్యతకు పరిమితం కాకుండా జి.వో.ఎం.ఎస్. 90 ఉద్దేశించని ఇతర అంశాలను పరిగణనలోనికి తీసుకొని అర్హులయిన వారిని కూడ విడుదల చేయరాదని సూచిస్తూ ఉంది. భారత న్యాయవాదుల సంఘం వేసిన రిట్ పిటిషన్‌కు జవాబుగా రాష్ట్ర హోంశాఖ దాఖలు చేసిన వివరాలు దీనిని స్పష్టం చేస్తాయి. తాము ఎవరెవరి కేసులు పరిశీలించినదీ, ఎవరెవరి విడుదల రికమెండ్ చేసినదీ, తక్కినవారిది ఎందుకు చేయనిదీ ఆ జవాబులో చెప్పారు. ఈ వివరాలను పరిశీలిస్తే త్రిసభ్య కమిటీ ఖైదీలకు ఎంత అన్యాయం చేస్తున్నదో అర్థం అవుతుంది.

ఇప్పటికి తాము మొత్తం 272 మంది ఖైదీల కేసులు పరిశీలించామని వారు ఆ జవాబులో అన్నారు. ఇందులో 126 మంది కేసులలో జైలు అధికార్ల నివేదిక ఇంకా అందవలసి ఉంది కాబట్టి వచ్చే సమావేశానికి నిర్ణయం వాయిదా వేసామన్నారు. వచ్చే సమావేశం ఎప్పుడు జరుగుతుందో ఎవరికీ తెలీదు. కాబట్టి సంవత్సరానికి కనీసం నాలుగుసార్లు కలవాలన్న నియమాన్ని త్రిసభ్య కమిటీ పాటించడం లేదు కాబట్టి, ఆ ఖైదీలు ఇంకెంత కాలం కాచుకోవాలో! 272లో 126 మంది భవిష్యత్తు ఈ విధంగా వాయిదా పడగా, మరొక 58 మంది విడుదలను కమిటీ తిరస్కరించింది. ఎందుకోసం తిరస్కరించింది? 65 ఏళ్ల వయసు దాటలేదనా? ఆరోగ్యంగానే ఉన్నారనా? 10 సం॥ల శిక్ష పూర్తి కాలేదనా? ఈ మూడు విధాలా అనర్హులయిన వారి విడుదలను మట్టుకే కమిటీ తిరస్కరించాలి. కానీ అర్హతలున్న వారి విషయంలో కూడ త్రిసభ్య కమిటీ అప్రస్తుతమైన కారణాలు చూపించి తిరస్కరించింది. ఎక్కువ మంది విషయంలో కమిటీ చూపించిన కారణం ఏమిటంటే వాళ్లు పెరోల్ మీద బయటకి పోయినప్పుడు సకాలంలో తిరిగి సరండర్ కాకుండ జాప్యం చేసారని. జివో ఎం.ఎస్. 90 చేసిన సూచనకు దీనికి సంబంధం ఏమిటి? 65 సం॥ల వయసు దాటిన ఖైదీ, లేక ఆరోగ్యం బాగుగా లేని ఖైదీ, గతంలో పెరోల్ నియమాలు సక్రమంగా పాటించనంత మాత్రాన ఇప్పుడువిడుదలకు అనర్హులవుతారా? ఇది కాక వేరే కొన్ని కారణాలను కూడ తన తిరస్కృతికి ఆధారాలుగా చూపించింది త్రిసభ్య కమిటీ. కొంతమంది జైలులోపల కొత్తగా నేరాలు చేసి శిక్ష పొంది వున్నారు కాబట్టి ఇతరత్రా అర్హులయినప్పటికీ వదిలి పెట్టం అన్నారు. కొంతమంది జీవిత ఖైదీలు చేసిన నేరం హేయమయినది కాబట్టి వదిలిపెట్టం అన్నారు. వీటికి జివో ఎం.ఎస్. 90లోని ఆదేశాలకు సంబంధం ఏమిటో త్రిసభ్య కమిటీ సభ్యులకే తెలియాలి.

అఖిల భారత జైళ్ల సంస్కరణ కమిటీ సూచనల ద్వారా జీవితఖైదీలు పొందిన ఒక చట్టపరమయిన హక్కును రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ ఖైదీలకు దక్కకుండ అడ్డుపడుతూ వుంది. నిర్హేతుకమయిన నిర్ణయాలు చేస్తూ వుంది. మీరు ఏ పార్టీ వారయినా ఈ సమస్యను ఖైదీల హక్కులకు సంబంధించిన సమస్యగా గుర్తించి స్పందిస్తారనీ, జివో ఎం.ఎస్. 90 సక్రమంగా అమలు కావడం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తారనీ ఆశిస్తాము. ఈ విషయంలో మీ కృషికి మేము చేయగల సహాయం చేస్తామని హామీ ఇస్తున్నాం.

సెప్టెంబర్ 1, 1992

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం